## క్లుప్తంగా

### హుండీ దొంగకు 14 రోజులు రిమాండ్

జే.పంగులూరు: మండలంలోని చందలూరు గ్రామంలో గల పోలేరమ్మ గుడిలో హుండీ చోరీ చేసిన దొంగకు అద్దంకి కోర్టు న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు రేణింగవరం ఎస్సై వినోద్‌బాబు మంగళవారం తెలిపారు. హుండి దొంగ పూరిమెట్ల నారాయణరావు చందలూరు పాలేరమ్మ గుడిలో హుండి దొంగతనం చేయగా, ఆ గ్రామానికి చెందిన కంది మల్ల శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు రేణింగవరం ఎస్సై వినోద్ బాబు కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ, చీరాల డీఎస్పీ ఉత్తర్వుల మేరకు అద్దంకి రూరల్ సీఐ పర్యవేక్షణలో వినోద్‌బాబు ఆయన సిబ్బంది వివిధ ప్రాంతాల్లో దర్యాప్తు చేసి మంగళవారం ఉదయం 8 గంటలకు అలవలపాడు అద్దరరోడ్డు వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నారాయణను విచారించగా గతంలో సుమారు నాలుగు దొంగతనం కేసులు తనపై ఉన్నట్లు నేరాలు ఒప్పుకున్నాడని, వెంటనే అతనిని అద్దంకి కోర్టుకు హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై వినోద్‌బాబు తెలిపారు.

### 106 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చీరాల: షుగర్ రోగులు ఆహార నియమాలను తప్పనిసరిగా పాటించాలని డాక్టర్ జి.నవీన్‌కుమార్ అన్నారు. మంగళవారం కామాక్షి కేర్ హాస్పిటల్‌లో షుగర్, ఎముకలు, కంటి సమస్యలపై ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. షుగర్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ నవీన్‌కుమార్, ఎముకల స్పెషలిస్ట్ డాక్టర్ పి.దివ్య, ల్యాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ గవిని లక్ష్మీనారాయణ, ఆప్తమాలిక్ ఆఫీసర్ టి.కుమార్‌లు పాల్గొన్నారు. ఈశిబిరంలో 106 మంది రోగులు పాల్గొని వైద్యపరీక్షలు చేయించుకున్నారు. ఉచితంగా రక్తపరీక్షలు, ఈసీజీ, గుండె పరీక్షలు, అవసరమైన వారికి మందులు అందించారు. కార్యక్రమంలో హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ తాడివలస దేవరాజు, సిబ్బంది పాల్గొన్నారు.


ఇసుకను ట్రాక్టర్‌కు నింపుతున్న అక్రమార్కులు


బోయినవారిపాలెం ఇసుక దిబ్బలను కరిగించేస్తున్న అక్రమార్కులు

# ఇసుక దందా.. అడ్డుకట్ట ఉందా!

- అధికారం మాదే.. మమ్మల్ని ఆపేది ఎవరు ?
- అక్రమార్కులకు సిరులు కురిపిస్తున్న ఇసుక దందా
- మండలంలో జోరుగా ఇసుక తవ్వకాలు, అమ్మకాలు
- కీలకంగా మారిన 'రాజేశ్వరుడు'
- మామూళ్ల మత్తులో అధికారులు

"ఇసుక ఉచితం తమ్ముళ్లు.. ఇక నుంచి ఎవరైనా సరే ఎక్కడైనా సరే ఇసుకను ఉచితంగా తీసుకోవచ్చు, ఎవరైనా అడ్డుపడితే చెప్పండి తమ్ముళ్లు. ఏ అధికారి మిమ్మల్ని అడగడు. ఎవరికీ రూపాయి లంచం ఇవ్వొద్దు "

- సీఎం చంద్రబాబు నాయుడు చెప్పిన మాటలివి..



టైరు బండ్ల ద్వారా ఇసుకను తరలిస్తున్న దృశ్యం

చీరాల టౌన్: ఇలా ఉదయం ఎన్నికల ఫలితాలు వచ్చాయో లేదో సాయింత్రానికి కల్లా ఇసుక రీచ్‌లను మొత్తం ఖాళీ చేసిన ఘనత కూటమి నాయకులకే దక్కింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఇసుక దందాలు మూడు టైరు బండ్లు, ఆరు ట్రాక్టర్లుగా యథేచ్ఛగా అందినకాడికి దండుకుంటున్నారు కూటమి నాయకులు. నయా పైసా పెట్టుబడి లేకుండా పెద్దగా శ్రమలేకుండా లక్షలు తెచ్చిపెడుతున్న ఇసుక దందా నిర్వహిస్తున్న అక్రమార్కులు మాత్రం డోంట్ కేర్ అంటున్నారు. అధికార పార్టీ నేత అండదండలు ఉండటంతో అక్రమార్కులు ఇసుక దందాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. రాజకీయ ముఖ్యనేత అండదండలు, మామూళ్లు పుచ్చుకునే అధికారుల సంపూర్ణ సహకారంతో ఇసుక దిబ్బలని మీటర్ల కొద్ది తవ్వేసుకుంటున్నారు. ఇసుక ధరలు పెరగటంతో ఇసుక దందా చేసేందుకు అధికార పార్టీ ముఖ్యనేత అండదండలతో రాజేశ్వరుడు అతని బృందం, మరికొందరు కొత్త వారు రంగంలోకి దిగారు. స్థానిక పోలీసు, రెవెన్యూ, మైనింగ్, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులు కూడా రాజకీయ నాయకుల ఒత్తిళ్లు రావటంతో అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్నారు.

**కళ్లముందే ఇసుక తరలిపోతున్నా..**

ఇసుక తవ్వి.. తవ్వి గుంతలు ఏర్పడుతున్నా కాని అక్రమార్కులకు అండగా నిలుస్తూ స్వామి భక్తిని చాటుకుంటున్నారు అధికారులు. ఇసుక అక్రమార్కులు ఏ స్థాయికి వెళ్లారంటే అధికారులను నెలమామూళ్లు, ఉద్యోగులకు ఆమ్యామ్యాలు ఇస్తే చాలు మన పనిని చక్కగా చేసుకోవచ్చనే ధోరణికి వచ్చారు. ప్రధానంగా చీరాల మండలంలోని సముద్ర తీర ప్రాంతంతో పాటుగా ఈపూరుపాలెం, విజయనగర్ కాలనీ, సావరపాలెం, బోయినవారిపాలెం, తోటవారిపాలెం, పాతచీరాల తదితర ప్రాంతాల్లో ఇసుక దిబ్బలను ఇబ్బడిముబ్బడిగా కొడుతూ అధికారుల అండతో కోట్లు కొల్లగొడుతున్నారు. వీరందికి రాజేశ్వరుడు నేతృత్వం వహిస్తుండగా రోజుకు వంద ట్రాక్టర్లు, టైరు బండ్లుద్వారా ఇసుకను తరలిస్తూ లక్షలు వెనుకేసుకుంటున్నారు. ఈపురుపాలెంలో ఆరుగురు ప్రధానంగా ఇసుకను అక్రమంగా అమ్మకాలు చేస్తున్నారు. శివారు కాలనీలు, ప్రధాన రోడ్డుపై వెళ్తే చాలు ఎక్కడ చూసినా ఇసుక తరలిస్తున్న టాక్టర్లు, టైరుబండ్లు కనిపిస్తూనే ఉన్నాయి. మైనింగ్, విజిలెన్స్, రెవెన్యూ, పోలీసు అధికారులకు మాత్రం అసలు ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా పొక్లెయిన్లు పెట్టి తవ్వుతూ రోజూ రాత్రిళ్లు, పగలు తేడా లేకుండా ట్రాక్టర్లు, టైరు బండ్లు ద్వారా ఇతర ప్రాంతాలకు తరలించే ఇసుక 'తోడేళ్ల' జోలికి మాత్రం వెళ్లరు. అక్రమ ఇసుక క్వారీల నుంచి ట్రాక్టర్ల ద్వారా ప్రధాన రోడ్ల ద్వారా తరలిస్తున్నారు. చీరాల పట్టణంతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు ఇసుకను అక్రమంగా తరలిస్తుంటారు. ఇందులో ఎక్కువ మందికి అధికార పార్టీ నేత అండదండలు, పలుకుబడి ఉండటం, మరికొంత మందికి మాత్రం పలుశాఖల అధికారుల సహాయ, సహకారాలు ఉన్నట్లు సమాచారం.

**టైరు బండి ఇసుక రూ. 2 వేలు, ట్రాక్టర్ రూ.4 వేలు**

ఇసుక అక్రమార్కులకు కల్పవృక్షంగా మారింది. గతంలో అర్ధరాత్రిళ్లు టైరుబండితో ఇసుకను తరలించే అక్రమార్కులు నేడు 24 గంటలు టైరుబండ్లు, ట్రాక్టర్లతో ఇసుకను సరఫరా చేస్తు పొలిమేరలు దాటిస్తున్నారు. టైరు బండి ఇసుకను రూ. 2 వేల వరకు, ట్రాక్టర్‌ను రూ.4 వేలకు వసూళ్లు చేస్తున్నారు. అయినా ఎవరి అనుమతులు లేకుండానే దర్జాగా ఇసుక దందాను కొనసాగిస్తున్నారు.

**కొత్తవారు దర్జాగా ఎంట్రీ..**

ఇసుక అక్రమవ్యాపారం చేస్తే అతి కొద్దిరోజుల్లోనే లక్షలు గడిస్తుండటంతో ప్రస్తుతం అందరి దృష్టి ఇసుక వ్యాపారంపై పడింది. చీరాల మండలంలోని రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఈపురుపాలెం, బోయినవారిపాలెం, తోటవారిపాలెం, గవినివారిపాలెంతో పాటుగా విజయనగర్‌కాలనీ, పాతచీరాల తదితర గ్రామాల్లో అధికార పార్టీ నేత అండతో రాజేశ్వరుడు, చోటామోటా రాజకీయ నాయకులతో పాటు పలువురు ఇసుక అక్రమ వ్యాపారంలోకి దిగారు. ముఖ్యంగా ఇసుక వ్యాపారం చేస్తే జీవితంలో సెటిల్ అయిపోవచ్చనే నమ్మకంతో చాలా మంది కొత్తగా ఇసుక దందాకు దిగారు. అదేమంటే చాలా కాలంగా అక్రమ వ్యాపారం చేస్తున్న వారిని ఏమి అనకుండా మా జోలికి ఎందుకు వస్తారులే అనే ధైర్యంతో ఇసుకను తోడేస్తున్నారు.

> **ఇసుక అక్రమ రవాణా చేస్తే ఉపేక్షించం..**
> గ్రామాల్లో రెవెన్యూ సిబ్బందితో తనిఖీలు చేయిస్తున్నాం. ఈపురుపాలెం, బోయినవారిపాలెం, పాత చీరాల, తీర ప్రాంత గ్రామాల్లో అక్రమంగా ఇసుక క్వారీలు నిర్వహించినా, అమ్మకాలు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవు. అనుమతులు లేకుండా ఇసుకను అమ్మకాలు చేస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతాం.
> - కుర్రా గోపీకృష్ణ, తహశీల్దార్

### విద్యుత్ అధికారుల ఆకస్మిక దాడులు


అక్రమ వినియోగదారులకు నోటీసులు అందిస్తున్న అధికారులు

ఇంకొల్లు (చినగంజాం): అక్రమంగా విద్యుత్ వాడుతున్న ఇళ్లపై అధికారులు ఆకస్మిక దాడులు చేశారు. మంగళవారం ఇంకొల్లు మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ శాఖాధికారులు దాడులు నిర్వహించి అక్రమ విద్యుత్ వాడకం దారులకు జరిమానా విధించారు. మండలంలోని మొత్తం 14 గ్రామాల్లో 33 విద్యుత్ అధికారుల బృందాలు 2500 సర్వీసులను తనిఖీ చేసి 100 కేసులను నమోదు చేశారు. వీటిలో అదనపు లోడు సర్వీసులు 95 కాగా, అక్రమ విద్యుత్ వాడకం నిర్వహిస్తున్న మరో 5 కేసులను అధికారులు పట్టుకొని కేసు నమోదు చేశారు. వారికి మొత్తం రూ. 4.50 లక్ష జరిమానా విధించారు. ఈ దాడుల్లో బాపట్ల డిప్యూటీ ఈఈ మల్లికార్జునరావు, చీరాల ఈఈ కే జాన్‌థామస్, వేటపాలెం డిప్యూటీ ఈఈ శ్రీనివాసులు, చీరాల డిప్యూటీ ఈఈ హరిప్రసాదరావు, పర్చూరు డిప్యూటీ ఈఈ ఎన్ రమేష్‌బాబు, మరో తొమ్మిది మంది ఏఈలు దాడుల్లో పాల్గొన్నారు.

### రేపటి నుంచి సర్పంచ్, కార్యదర్శులకు శిక్షణ

బల్లికురవ: మండలస్థాయి అధికారులు గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, సెక్రటరీలు సచివాలయ సిబ్బందికి ఎల్ఎస్‌డీజీఎస్‌పై మండల పరిషత్ కార్యాలయంలో రెండు బ్యాచ్‌లుగా గురు, శుక్రవారాల్లో శిక్షణ ఉంటుందని ఎంపీడీవో కుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగే శిక్షణకు హాజరు కావాలన్నారు.

### ఐదుగురు జూదరుల అరెస్టు

వేటపాలెం: దేశాయిపేట పంచాయతీ విఘ్నేశ్వర కాలనీ శివారులో పేకాట శిబిరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ఎం వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.3,800 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చనున్నట్లు తెలియజేశారు.

# సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

చీరాల టౌన్: భూ సమస్యలు పరిష్కరించేందుకే 'మీభూమి-మీహక్కు' కార్యక్రమం పేరుతో సదస్సులను నిర్వహిస్తున్నామని చీరాల ఆర్డీవో టి.చంద్రశేఖర్ నాయుడు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని వాడరేవు గ్రామ పంచాయతీ సచివాలయం వద్ద రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రెవెన్యూ సదస్సుకు ఆర్డీవో హాజరై గ్రామ పరిధిలో ప్రజలకు ఉన్న భూ సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో ఉన్న భూ సమస్యలను పరిష్కరించి రైతులకు న్యాయం చేయడంతో పాటు భూ సమస్యల నుంచి విముక్తులను చేసేందుకే ప్రభుత్వం ప్రత్యేకంగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందన్నారు. విలువైన భూముల రికార్డులను భద్రంగా ఉంచి భవిష్యత్‌లో ఇబ్బందులు లేకుండా భద్ర పరచాలన్నారు. సమస్యలపై 39 అర్జీలను ప్రజలు అందించగా వీటన్నింటిని త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ల్యాండ్స్ అండ్ సర్వే డివిజినల్ ఇన్‌స్పెక్టర్ జి.మునలయ్య, తహశీల్దార్ కుర్రా గోపీకృష్ణ, డీటీ దేవతోటి అర్జున్, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.


వాడరేవులో అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

**తిమిడెపాదపాడులో..**

కారంచేడు: గ్రామాల్లోని భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని ఇన్‌చార్జ్ తహసీల్దారు అనిత అన్నారు. మంగళవారం ఆమె మండలంలోని తిమిడెపాదపాడు గ్రామ పంచాయతీ సర్పంచ్ అధ్యక్షతన సచివాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో సర్వేయర్ సత్యన్నారాయణ, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జే.పంగులూరు: రెవెన్యూ సదస్సులను ఉపయోగించుకొని గ్రామాల్లో ఉండే భూ సమస్యలను పరిష్కరించుకోవాలని పంగులూరు మండల తహశీల్దార్ పీ సింగారావు కోరారు. మండలంలోని ముప్పవరం, జాగర్లమూడివారిపాలెం గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులు జరిగాయి. సదస్సులో మొత్తం 13 అర్జీలు వచ్చాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ మైనింగ్ ఏడీ రాజేష్ కుమార్, ఆర్ఐ బాపయ్య, సర్వేయర్ సురేష్ బాబు, వీఆర్వోలు రెవెన్యూ సిబ్బంది మొత్తం పాల్గొన్నారు.


తిమిడెదపాడులో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ తహసీల్దారు అనిత


పంగులూరు సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ సింగారావు

### రేపు డయల్ యువర్ డీఎం

చీరాల అర్బన్: డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని గురువారం ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ జె.శ్యామల మంగళవారం తెలిపారు. చీరాల ఆర్టీసీ డిపో పరిధిలోని చీరాల, పర్చూరు నియోజకవర్గాలలోని ప్రయాణికులు డిపో మేనేజర్ నెంబర్ 99592 25696 ద్వారా ఆర్టీసీ సర్వీసులపై సలహాలు, సూచనలు, ఫిర్యాదులు ఫోన్ ద్వారా అందించవచ్చన్నారు. ఆర్టీసీ ప్రయాణీకులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకుని డిపో అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

### దివ్యాంగురాలికి ఆర్థిక సాయం


నగదు సాయం అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

మార్టూరు: కుటుంబ పోషణ కష్టమై దుర్భర పరిస్థితిని ఎదుర్కొంటున్న ఓ దివ్యంగురాలి కుటుంబానికి హెల్పింగ్ హాండ్స్ సంస్థ ప్రతినిధులు అండగా నిలిచారు. మంగళవారం వారి నివాసానికి వెళ్లి నిత్యావసర సరుకులు పంపిణీతో పాటు రూ.5 వేల నగదు సాయం అందించారు. మార్టూరు తూర్పు బజారు సమీపంలో నివసిస్తున్న మిరియాల 50 ఏళ్ల రామసుబ్బులు పుట్టుకతోనే పోలియో వ్యాధి సోకటంతో బాల్యం నుంచి మంచానికే పరిమితమై ఉంది. కొంతకాలం క్రితం తండ్రి మరణించడం, వృద్ధురాలైన తల్లికి కుటుంబ పోషణ భారంగా మారిన వైనాన్ని గుర్తించిన సంస్థ అధ్యక్షుడు పఠాన్ ఖాదర్ వలి తమ బృందంతో కలిసి ఆమె కుటుంబానికి అవసరమైన నిత్యావసర సరుకులు, నగదు సాయం అందించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పుట్టా అయ్యప్ప, పుట్టా వెంకటేశ్వర్లు, కాలేషా, జాఫర్, బాషా, జానీ, ఓపీడీ ఆర్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

# శ్మశానంలో చిల్లచెట్లు తొలగింపు


ముక్తేశ్వరం శ్మశానవాటికకు మట్టితోలుతున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..


అంబడిపూడి శ్మశాన వాటికలో చెల్లచెట్లు తొలగిస్తున్న పొక్లెయిన్

బల్లికురవ: దినపత్రికల్లో వచ్చిన కథనాలకు ఎట్టకేలకు అధికారులు కదిలారు. శ్మశానికి వెళ్లే రహదారులు బురదమయంగా ఉండటంతో అభివృద్ధి పనులకు మంగళవారం మూడు గ్రామ పంచాయతీల్లో చేపట్టారు. ఆదివారం సాక్షి దినపత్రికలో 'శ్మశానంలో నరకం' కథనం ప్రచురించటంతో ఎంపీడీవో వై కుసుమకుమారి, ఈవోఆర్డీ దాసరి సుమతి స్పందించారు. మండలంలో అధ్వానస్థితిలో ఉన్న శ్మశాన వాటికలన్నింటిని అభివృద్ధి పరచాలని గ్రామ పంచాయితీల సెక్రటరీలను ఆదేశించారు. ముక్తేశ్వరం గ్రామానికి ఉత్తరభాగంలో రైస్‌మిల్లు సమీపంలో ఉన్న హిందూ శ్మశాన వాటికలోని చిల్లచెట్లను సెక్రటరీ షేక్ మీరావలి, సర్పంచ్ ఎం. లక్ష్మీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పొక్లెయిన్‌తో తొలగించారు. రహదారి అభివృద్ధికి ట్రాక్టర్లతో గ్రావెల్ తోలించి చదును చేయించారు. అంబడిపూడిలో సెక్రటరీ అహమ్మద్ సర్పంచ్ కుసుమకుమారి ఆధ్వర్యంలో చిల్లచెట్లను తొలగించారు. వైదనలో సెక్రటరీ సీహెచ్ వరప్రసాదరెడ్డి, సర్పంచ్ మేడా జయలక్ష్మీ ఆధ్వర్యంలో చిల్లచెట్లను తొలగించారు. చిల్లచెట్లను తొలగించి అభివృద్ధి పరచడంపై ఆయా గ్రామాల ప్రజలు సాక్షికి ధన్యవాదాలు తెలిపారు.

# విద్యార్థుల్లో పోటీతత్వం అవసరం


ప్రతిభా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

వేటపాలెం: విద్యార్థులు చదువుల్లో పోటీతత్వాన్ని పెంపొందించుకొని చదువుల్లో రాణించాలని రొండా వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో రొండా రామకష్టా రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో ప్రతిభా పోటీలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ ప్రతిభా పోటీలు నిర్వహించారు. క్విజ్, వ్యాసరచన, వకత్వం, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు ఈనెల 23వ తేదీన బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలతో యువత జీవితం నాశనం

కారంచేడు: నేటి సమాజంలో యువతీ, యువకులు చెడు వ్యసనాలకు లోనై తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని.. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ వీ వెంకట్రావు అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన మండలంలోని కుంకలమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాటశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సైబర్ క్రైంపై అవగాహన కలిప్పించారు. పోలీసు యంత్రాంగం అన్ని రకాగా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నా సైబర్ నేరగాళ్ల కొత్త మార్గాల్లో నేరాలకు పాల్పడుతున్నారన్నారు. మనకు తెలియని నంబర్లు, వ్యక్తుల ద్వారా ఎట్టి పరిస్థితుల్లోనూ ఉత్తర ప్రత్యుత్తరాలు చేయకూడదన్నారు. అలాగే యువత ప్రమాదాలకు గురవ్వకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


చెడు వ్యసనాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకట్రావు

### 20 మద్యం బాటిళ్లు పట్టివేత

అద్దంకి రూరల్: అద్దంకి పట్టణంలోని వేర్వేరు ప్రాంతాల్లో అక్రమంగా మద్యం బాటిళ్లు అమ్ముతున్న ఇరువురిని అదుపులోకి తీసుకున్నామని ఎక్సైజ్ సీపీ భవాని మంగళవారం రాత్రి తెలిపారు. సీఐ వివరాల మేరకు అద్దంకిలోని సంజీవనగర్‌కు చెందిన సాయికుమార్ నుంచి 10 బాటిళ్లు, శింగరకొండ పాలెంలో వల్లెపు నాగలక్ష్మీ నుంచి 10 బాటిళ్లు స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు.

### విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ

బల్లికురవ: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఖాతాదారులకు విశిష్ట సేవలు అందించటంతోపాటు చదువులో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రతి ఏడాది ఉపకార వేతనాలు అందిస్తామని బల్లికురవ శాఖ బ్రాంచ్ మేనేజర్ కె. శీనా నాయక్ తెలిపారు. మంగళవారం రాత్రి స్థానిక కస్తూర్బాగాంధీ గురుకుల బాలికల విద్యాలయంలో 7,8, 9, తరగతుల్లో ప్రతిభకనబరిచిన బీ. అమృత, బీ. మహిమ తేజస్వీ, యు.గాయత్రిలకు ఒక్కొక్కరికి రూ. 5 వేల చొప్పున చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్లు కె. సుహిత గ్రేస్, జీ. బిందుమాధవి, డీ. గోపి కృష్ణ, విద్యాలయం ప్రిన్సిపాల్ కోనా సరళకుమారి, ఉపాధ్యాయునులు పాల్గొన్నారు.


ఉపకార వేతనం చెక్ అందజేస్తున్న ఏపీజీబీ మేనేజర్

# సేవా కార్యక్రమాలకు పూర్తి సహకారం

చీరాల టౌన్: సమాజ సేవా కార్యక్రమాలకు అపోలో హాస్పిటల్ పూర్తి సహకారం అందిస్తామని అపోలో మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ డి.రవికిరణ్ అన్నారు. మంగళవారం మండలంలోని దేవాంగపురి గ్రామ పంచాయతీలో అపోలో హాస్పిటల్, కృతి ఫౌండేషన్ సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో ప్రముఖ వైద్యులు కావ్యారెడ్డి, లతశ్రీ, రంగనాథ్, గోపీవర్మ నేతృత్వంలో సాధారణ, గైనకాలజీ, ఆర్థోపెడిక్, పీడియాట్రిషన్ విభాగాల్లో 255 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, ఈసీజీ, ఎక్స్‌రే, రక్త పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హాస్పిటల్ మేనేజర్ గోవర్ధన్‌రెడ్డి, సిబ్బంది, గ్రామ ప్రజలు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.


వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న అపోలో వైద్యులు

### రాష్ట్రస్థాయి కౌశల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక


పవన్ గోపీకృష్ణ


ప్రవల్లిక

జే.పంగులూరు: జిల్లా స్థాయి కౌశల్ క్విజ్ పోటీలో కొండమంజులూరు పాఠశాల విద్యార్థి చాతరాజుపల్లి పవన్ గోపీకృష్ణ ద్వితీయ స్థానం సాధినట్లు మంగళవారం హెచ్‌ఎం అనిత ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలు ఈనెల 6వ తేదిన బాపట్లలో జరిగినట్లు తెలిపారు. 8వ తరగతి విభాగంలో విద్యార్థికి ద్వితీయ స్థానం వచ్చినట్లు జిల్లా సైన్స్ అధికారి సాధిక్ తెలిపారు. గోపీకృష్ణ ఈనెల 30న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఇమ్మిడి శెట్టి అనిత, ఉపాధ్యాయుల బృందం, విద్యాకమిటీ చైర్మన్ గోలి సంధ్యారాణి, వైస్ చైర్మన్ రావుల వెంకట నరసింహారావు విద్యార్థిని అభినందించారు.

సంతమాగులూరు (అద్దంకి రూరల్): ఈనెల 6వ తేదీన జిల్లాస్థాయిలో జరిగిన కౌశల్-2024 ఆన్‌లైన్ పరీక్షలో 8వ తరగతి విభాగంలో మండలంలోని మక్కెనవారిపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎం. ప్రవల్లిక పాల్గొనగా జిల్లాస్థాయిలో 4వ ర్యాంకు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అయినట్లు హెచ్‌ఎం ఎం అర్జున్ తెలిపారు. ఈనెల 29, 30వ తేదీలో విజయవాడలో జరిగే పోటీ పరీక్షలో ప్రవల్లిక పాల్గొననున్నట్లు తెలిపారు.